


# 56 వ భాగం

## దక్ష ప్రజాపతి – 5

## సతీదేవి ప్రయాణం

సతీదేవి తండ్రి చేసే యజ్ఞానికి పిలవకపోయినా వెళతానని శివుణ్ణి అడిగింది కదా? అలా వెళ్ళడానిక్కూడా అనేకానేక కారణాలు చెప్పింది. అయితే శివుడేమంటున్నాడో చూద్దాం ఇప్పుడు.

సీ. "కల్యాణి నీ మాట గడు నొప్పు; బంధువుల్;
పిలువకుండినను సంప్రీతిఁ జనుదు
రంటి; విదియు లెస్స యైనను దేహాభి;
మాన మదము ననమర్షమునను
గడఁగి యారోపిత ఘన కోపదృష్టులు;
గారేనిఁ బోఁదగుఁ గాని వినుము
వినుత విద్యా తపోవిత్త వయో రూప;
కులములు సుజనులకును గుణంబు; [4-69]

తే. లివియ కుజనులయెడ దోషహేతుకంబు
లై వివేకంబు చెఱుచు; మహాత్ములైన
వారి మాహాత్మ్యమాత్మ గర్వమునఁ జేసి
జడులు పొడగానఁ జాలరు జలజనేత్ర! [4-69-.1]

కల్యాణీ, నువ్వే చెప్పే మాటాలన్నీ యదార్ధాలు. పిలవకపోయినా బంధువుల ఇంటికి వెళ్ళొచ్చు అనేది నిజమే. అయితే దేహాభిమానం, మదం, ఓర్వలేనితనం (అమర్షము) రెట్టించిన కోపం ఉన్నవాళ్ల దగ్గిరకి పోకూడదు. విద్య తపస్సు, వయో రూపాల వల్ల మంచివాళ్లకి సుగుణాలు అలవడితే ఆవి కుజనులకి గర్వం కలిగిస్తాయి. అందువల్ల అటువంటి వారింటికి వెళ్ళకూడదు. మందబుద్ధులైన వారు గర్వం వల్ల మహాత్ముల గొప్పతనాన్ని చూడలేరు.

క. వినుమట్టి కుటిలు లగు దు
ర్జనుల గృహంబులకు బంధుసరణిని బోవం
జనదు; వినీతుల కది గడు
ననుచిత మైనట్ల యుండునది యెట్లనినన్. [4-70]

అటువంటి కుటిల దుర్జనుల ఇళ్ళకి బంధువులమంటూ వెళ్ళకూడదు. నీతిమంతులైన వారికి అది అనుచితంగా ఉంటుంది. ఎలాగంటే,

ఆ. కుటిలబుద్ధు లయిన కుజనుల యిండ్లకు
నార్యు లేగ, వా రనాదరమున
బొమలు ముడిపడంగ భూరి రోషాక్షులై
చూతురదియుఁ గాక సుదతి! వినుము. [4-71]

కుటిల బుద్ధులైనవారింటికి ఆర్యులు (పూజనీయులు) వెళ్తే అనాదరంతో వాళ్ళు ఎక్కువగా రోషంతో కనుబొమలు ముడిచి చూస్తారు మనకేసి. ఎక్కువ రోషాన్ని ఇక్కడ పోతన ఏమన్నాడు? భూరి రోషాక్షులై. భూరి అనే పదాన్ని అంబరీషోపాఖ్యానంలో – భూరి దానాలు ఇచ్చాడు అని చెప్పినప్పుడు – ఒకసారి చూసాం. భూరి అంటే ఒకటి తర్వాత 34 సున్నలు పెడితే వచ్చేది. అంటే మనని ఇష్టపడనివారింటికి పిలవని పేరంటం గా వెళ్తే అంత కోపం తో చూస్తారు మనకేసి. అలా జరిగితే,

చ. సమద రిపుప్రయుక్త పటుసాయక జర్జరితాంగుఁ డయ్యు దుః
ఖమును దొఱంగి నిద్రఁగనుఁ గాని కృశింపఁడు మానవుండు; నో!
యుమ! విను మిష్ట బాంధవదురుక్తులు మర్మము లంట నాఁటఁ జి
త్తమున నహర్నిశంబుఁ బరితాపము నొంది కృశించు నెప్పుడున్. [4-72]

శత్రువు ప్రయోగించిన బాణాలు శరీరం తూట్లు పడేలా కొట్టినా ఆ శారీరిక బాధ అనుభవిస్తూ ఎలాగో ఒకలా నిద్రపోవచ్చు కృశించిపోకుండా కానీ, మన దగ్గిర బంధువులు చెడ్డమాటలంటే వాటివల్ల అహర్నిశలూ మనసుకి కష్టం కలుగుతూ, కృశించిపోయే పరిస్థితి వస్తుంది. అంటే దేహబాధ కంటే అవమానం వల్ల వచ్చే బాధ మరింత ఎక్కువ.

క. విను లోకోత్కృష్టుఁడు ద
క్షునికిఁ దనూభవలలోనఁ గూరిమిసుతవై
నను నా సంబంధంబున
జనకునిచేఁ బూజఁ బడయఁజాలవు తరుణీ! [4-73]

నిజానికి నువ్వు లోకోత్కృష్టుఁడైన దక్షుడికి ఇష్టమైన కూతురివైనా, నాతో ఉన్న విరోధం వల్ల నీ తండ్రి చేత మాట పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఆయన నిన్ను ఆదరించడు. శివుడికి దక్ష ప్రజాపతి మీద కోపం ఉందేమో అందుకే అలా అంటున్నాడని సతీదేవి అనుకుంటుందేమో అని ఇక్కడ శివుడు

దక్షుణ్ణి ఏమంటున్నాడు? లోకోత్కృష్టుఁడు – ఎందుకంటే బ్రహ్మ దక్షుణ్ణి ప్రజాపతులందరి మీదా అధిపత్యం ఇచ్చాడు కదా? దక్షుడి చేసే పనీ, మిగతా విషయాలూ మంచివే కానీ ఈ అకారణ కోపం వల్ల విరోధం పెంచుకుని ఆదరించడు సుమా అని స్పష్టంగా చెప్తున్నాడు. అయితే మరో విషయం ఉంది.

వ. అది యెట్లతనిచేత భవత్సంబంధంబునం జేసి పూజఁబడయమికి నతనికి నీకు విరోధంబునకు హేతు వెట్టి దని యంటివేని.

[4-74]

అదేమిటి మీ ఇద్దరికీ ఏవో విరోధం ఉంటే స్వంత కూతుర్నైన నన్ను ఆదరించడానికి, పోవడానికి కారణం ఏమిటని అడుగుతావేమో?

మ. నిరహంకార నిరస్తపాప సుజనానింద్యోల్ల సత్కీర్తిఁ గొం
దఱు కామించి యశక్తులై మనములన్ దందహ్యమానేంద్రియా
తురులై యూరక మచ్చరింతురు; మహాత్ముం డీశ్వరుం డైన యా
హరితో బద్ధ విరోధముం దొడరు దైత్యశ్రేణి చందంబునన్. [4-75]

అహంకారంలేని వారూ, పాపంలేని సజ్జనులనీ చూసి కొంతమంది తమకు అటువంటి గుణాలు చేతకాక, అసమర్థులై వాళ్ల మీద అసూయ పెంచుకుని, శ్రీహరి మీద విరోధం పెంచుకున్న రాక్షసుల్లా తయారౌతారు. ఎంతటి శివభక్తుడైనా పోతన రాసే దాదాపు ప్రతీ పద్యంలోనూ మనం చూసేది 'హరి' అనే పదం. ఎందుకంటే రాసేది విష్ణుకథ అయిన మహాభాగవతం, రాయమన్నవాడు – పలికించెడువాడు రామభద్రుడట. ఆ విషయం పోతన ఎప్పుడూ మర్చిపోలేదని అనిపిస్తుంది మనకి.

వ. అదియునుం గాక, నీ వతనికిం బ్రత్యుత్థానాభివందనంబులు గావింపకుండుటం జేసి యతండు తిరస్కృతుండయ్యె నంటివేని లోకంబున జను లన్యోన్యంబును బ్రత్యుత్థానాభివందనంబులు గావింతు; రదియ ప్రాజ్ఞ లయినవారు సర్వభూతాంతర్యామి యైన పరమపురుషుండు నిత్యపరిపూర్ణుండు గావునఁ గాయిక వ్యాపారం బయుక్తం బని తదుద్దేశంబుగా మనంబునంద నమస్కారాదికంబులు గావింతురు; గాని దేహాభిమానంబులు గలుగు పురుషులందుఁ గావింపరు; కాన యేనును వాసుదేవ శబ్దవాచ్యుండు శుద్ధసత్త్వమయుండు నంతఃకరణంబు నందు నావరణ విరహితుడు నయి ప్రకాశించు వాసుదేవునకు నా హృదయంబున నెల్లప్పుడు నమస్కరించుచుండుదు; ఇట్ల నపరాధినైన నన్నుఁ బూర్వంబున బ్రహ్మలు చేయు సత్రంబు నందు దురుక్తులం జేసి పరాభవించి మద్ద్వేషియైన దక్షుండు భవజ్జనకుం డైన నతఁడును దదనువర్తు లయిన వారలును జూడఁ దగరు; కావున మద్వచనాతిక్రమంబునం జేసి యరిగితివేని నచట నీకుఁ బరాభవంబు సంప్రాప్తంబగు; లోకంబున బంధుజనంబులవలనఁ బూజ బడయక తిరస్కారంబు వొందుట చచ్చుటయ కాదే;" యని పలికి మఱియు నభవుండు, పొమ్మని యనుజ్ఞ యిచ్చిన నచ్చట నవమానంబునం జేసి యశుభం బగుననియు; నిచ్చటఁ బొమ్మనక నివారించిన మనోవేదన యగు ననియు మనంబునం దలపోయుచు నూరకుండె; అంత.

[4-76]

ఇదిగాక మరో విషయం ఉంది. మొదట్లో దక్షుడు వచ్చినప్పుడు యాగంలో లేచి నుంచుని ఆయనకి నమస్కారం పెట్టలేదని ఆయనకి కోపం వచ్చింది కదా, అలా నమస్కారం పెట్టకపోవడం అనేది నా తప్పే అంటావేమో సుమా, ప్రాజ్ఞులైనవారు సర్వభూతాత్మకుడైన శ్రీహరిని, పరమపురుషుణ్ణి అంతటా చూస్తూ ఉంటారు కనక ఆయనకి ప్రతీక్షణం మనసులో నమస్కారాలు అర్పిస్తూ ఉంటారు కానీ దేహాభిమానం ఉన్న వాళ్లకి బయటకి అందరికీ తెలిసేలా నమస్కారాలు పెట్టరు. శుద్ధసత్త్వమయుడు అంతఃకరణంలో ఆవరణ విరహితుడు అయి ప్రకాశించే ఆ శ్రీహరికి నేను సర్వవేళలా నమస్కరిస్తూ

ఉంటాను. అది అర్ధం చేసుకోక, నన్ను అపరాధిగా చేసి, పూర్వం బ్రహ్మతో పాటు చేసిన యజ్ఞంలో పరాభవించాడు దక్షుడు. అటువంటి వారి ఇళ్ళకి వెళ్లకూడదు. వెళ్తే పరాభవం జరిగితీరుతుంది.

ఇప్పటికి తెలిసింది కదా మనకి మొదట్లో శివుడు దక్షుడు వచ్చినప్పుడు లేచి నమస్కారం ఎందుకు పెట్టలేదో? అంటే మనలాంటి వాళ్ళం ఒక ఆశ్రమానికి వెళ్ళి అక్కడ రమణ మహర్షిలాంటి వారు మనకి గౌరవం ఇవ్వలేదనీ, నమస్కారం పెట్టలేదనీ — ఈ రోజుల్లో రాజకీయనాయకుల్లా – కోపం తెచ్చుకోవడం ఎవరికి నష్టం? మహర్షులనేవారు అందర్నీ ఒకే విధంగా చూస్తారు అని చెప్పడానికిదే ఉదాహరణ. వాళ్లు చూసేది మనలో ఉండే సర్వభూతాత్మకుడైన ఆత్మని, శ్రీహరిని, పరమపురుషుణ్ణి. మన భౌతిక దేహానికీ డబ్బుకీ దర్పాలకీ గౌరవం ఇస్తూ పోతే ఆ ఆశ్రమాలకి మామూలు జనం వెళ్ళనేలేరు కదా? అటువంటి డబ్బున్న ఆశ్రమాలూ, వాటి అధిపతులూ ఏమౌతున్నారో రోజూ చూస్తూనే ఉన్నాం. మరి రమణులంతటి వారో? పశుపక్ష్యాదులతో సహా వారి అనుగ్రహం అందరికీ సమానంగా — ఎవరి అర్హతని బట్టి వారికి — దొరుకుతూనే ఉంటుంది. దక్షుడు కూడా తన అల్లుడు, – "నేను" "నా" కూతుర్ని ఇచ్చి వివాహం చేసాను, "నాకు"– గౌరవం ఇవ్వలేదు అని బాహ్య, భౌతిక దేహానికి విలువలు ఇస్తూ ఆలోచించాడు తప్ప, అవతల ఉన్నవాడు — సాక్షాత్తూ భగవంతుడైన జన్మమరణాది నివర్తకుం దగు నభభవుడు — అని ఆలోచించలేకపోయాడు. అందువల్లే — ఈ "నేను," "నాది," నాకు" — అహంకారంతో గొడవ వచ్చి పడింది.

శివుడు సతీదేవితో ఇంతా చెప్పాక — వెళ్లమంటే అక్కడ అవమానం జరిగి సతీదేవికి అశుభం జరుగుతుందేమో అనీ, వెళ్ళొద్దంటే సతీదేవి మనసు నొచ్చుకుంటుందనీ మనసులో తలుస్తూ ఏ మాటా చెప్పలేదు పైకి. ఓ విషయం గమనించారా? శివుడు, 'సతీ, నీకు అవమానం జరుగుతుందని నాకు తెలుసు, వెళ్ళకు," అని లేచి కైలాసం గుమ్మానికి అడ్డంగా నుంచుని సతీదేవిని వెళ్లకుండా ఎందుకు చేయలేదు? ఎంతటి భగవంతుడైనా మన కర్మని ఆయన తప్పించడు. అది మనం అనుభవించవల్సిందే. అటువేపు దక్షుడు అహంకారంతో కూడగట్టుకునే కర్మకీ ఇటు సతీదేవి తండ్రి ఇంటికి పిలకుండా వెళ్లడానికీ భగవంతుడు కారకుడు కాదు. భగవంతుడో సాక్షి. అయితే ఎప్పుడైతే నిరంతరం ఆయన్ని తల్చుకుంటూ మన జీవితాన్ని "ఎలా ఉంటే అలా" అహంకారం విడిచి ఆశ్వాదిస్తూ సంతోషంగా ఉంటామో అప్పుడు ఆయన కృప మనని చేరడం గమనించవచ్చు. అయితే ఇక్కడ తెలుసుకోవల్సిందేమిటంటే, మనం చేయాల్సిన పని మానేసి 'అన్నీ నువ్వే చేసేయి, నేను కాలు కూడా కదపను' అనడం కుదరదు. దీనే గీతాచార్యులు చెప్పడం ప్రకారం 'కర్మణ్యే వ్యాధికారస్తే మా ఫలేషు కదాచన." దీనినే శ్రీరామకృష్ణులు మరింత సులభంగా చెప్తారు, "ఒక చేత్తో భగవంతుణ్ణి పట్టుకుని రెండో చేత్తో నీ పని చేస్తూ ఉండు. ఎప్పుడైతే నీ పని పూర్తైందో అప్పుడు రెండు చేతులూ భగవంతుడికే చేర్చు." అందుకే శివుడు ఏమాటా చెప్పకుండా ఊరుకున్నాడు.

సీ. సతి సుహృద్దర్శనేచ్ఛా ప్రతికూల దుః;
ఖస్వాంత యగుచు నంగములు వడఁక
నందంద తొరఁగెడు నశ్రుపూరంబులు;
గండభాగంబులఁ గడలుకొనఁగ
నున్నత స్తనమండలోపరిహారముల్;
వేఁడి నిట్టూర్పుల వెచ్చఁ గంద
నతిశోకరో షాకులాత్యంత దోదూయ;
మానమై హృదయంబు మలఁగుచుండ [4-77]

తే. మఱియుఁ గుపితాత్మయై స్వసమానరహితు
నాత్మదేహంబు సగ మిచ్చి నట్టి భవుని

విడిచి మూఢాత్మ యగుచు న వ్వెలఁది జనియె
జనకుఁ జూచెదు వేడుక సందడింప. [4-77.1]

శివుడిలా ఇలా అనేసరికి సతీదేవికి కోపం వచ్చింది. బంధువులని చూడడానికి స్వంత తండ్రి ఇంటికేగా, ఏమౌతుందిలే అనుకుని కోపంతో తండ్రి చేసే యజ్ఞానికి – తన దేహంలో సగం ఇచ్చినవాడినీ, తనతో సమానమైన మరొకడు లేని పరమేశ్వరుణ్ణీ — అందర్నీ విడిచి బయల్దేరింది.

సీ. మానిని చనుచుండ మణిమన్మదాది స;
హస్ర సంఖ్యాత రుద్రానుచరులు
యక్షులు నిర్భయులై వృషభేంద్రుని;
మున్నిడు కొనుచు నమ్ముదిత దాల్చు
కందుకాంబుజ శారికా తాళవృంత ద;
ర్పణ ధవళాతపత్రప్రసూన
మాలికా సౌవర్ణమణివిభూషణ ఘన;
సార కస్తూరికా చందనాది [4-79]

తే. వస్తువులు గొంచు నేగి శర్వాణిఁ గదిసి
శంఖ దుందుభి వేణు నిస్వనము లొప్ప
మానితంబైన వృషభేంద్రయానఁ జేసి
యజ్ఞభూమార్గులై యర్థి నరిగియరిగి. [4-79.1]

అయితే భృతులైన నంది, మణిమంతుడూ, అనేకమంది ప్రమథులు ఆవిడని వెనకనే అనుసరించారు – కావలసిన పూబంతులు, పద్మాలు, గోరువంకలు, విసనకర్రలు, అద్దాలు, వెల్లగొడుగు, పూలదండలు, మణులతో చేసిన బంగారు నగలు, పచ్చకర్పూరం, కస్తూరి, గంధం మొదలైన వస్తువులు కూడబట్టుకుని. కొంతదూరం పోయాక సతీదేవిని కలుసుకుని ఈ లాంఛనాలతో వృషభవాహనం మీద కూర్చోబెట్టి కదిలారు ముందుకి. ఇక్కడ సతిని పోతన ఏమన్నాడో గమనించారా? శర్వాణి — శర్వుని భార్య.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS